సబ్జెక్టులపై అవగాహన.. అధిక సాధన!

టాప్ ర్యాంకర్ మెలకువలు

రెండు తెలుగు రాష్ట్రాల ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షల్లో సత్తా చూపించి, టాప్ ర్యాంకులు సాధించాడు చల్లా ఉమేష్ వరుణ్. జేఈఈలోనూ జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు తెచ్చుకున్నాడు. ఈ పరీక్షల్లో తన విజయానికి దోహదపడ్డ అంశాల గురించి అతడి మాటల్లోనే....

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మా ఊరు. అమ్మానాన్నలు చల్లా విశ్వేశ్వరరావు, దేవకీదేవి. ఏపీఈఏపీసెట్‌లో ప్రథమ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో మూడో ర్యాంకు తెచ్చుకున్నా. జేఈఈ మెయిన్స్‌లో 263 ర్యాంకు, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 179వ ర్యాంకు సాధించాను.

ఇంటర్ (ఎంపీసీ)లో 983 మార్కులు వచ్చాయి. ఒకటి నుంచి నాలుగు తరగతులు నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో, అయిదో తరగతి చిలకలూరిపేట విజేత పాఠశాలలో, ఆరు నుంచి ఇంటర్ వరకు గుంటూరు భాష్యం విద్యాసంస్థల్లో చదివా.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలంటే.. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై లోతైన అవగాహన ఉండాలి. జేఈఈలో నెగెటివ్ మార్కులు ఉంటాయి. జవాబులు కచ్చితంగా గుర్తించాలి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు శ్రద్ధగా సన్నద్ధమయితే ఏపీఈఏపీసెట్, తెలంగాణ ఎంసెట్‌లలో ర్యాంకులు సునాయాసంగా తెచ్చుకోవచ్చు.

◆ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు భాష్యం విద్యాసంస్థల్లో శిక్షణ పొందాను. ప్రాథమిక స్థాయిలో బేసిక్స్ తెలుస్తాయి. ఇంటర్‌లో ఎక్కువగా ఐఐటీ ప్రవేశపరీక్ష మీద దృష్టిపెట్టి చదివించారు. నిత్యం 10-12 గంటలు చదివాను. ఈ పరీక్ష రాసే అభ్యర్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

◆ కళాశాల అధ్యాపకులు చెప్పిందే ఎక్కువగా చదివాను. వారు సూచించిన పుస్తకాలు అధ్యయనం చేశాను. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీలపై పూర్తి పట్టు వచ్చేలా చెప్పారు. పాత ప్రశ్నపత్రాలు సాధన చేశాను. మాక్ టెస్టులు నిర్వహించారు. ఇవి బాగా ఉపయోగపడ్డాయి. ఆన్‌లైన్‌లో ప్రాక్టీస్ చేయలేదు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు శ్రద్ధగా సన్నద్ధమయితే ఏపీఈఏపీసెట్, తెలంగాణ ఎంసెట్‌లలో ర్యాంకులు సునాయాసంగా తెచ్చుకోవచ్చు.

◆ ఏపీ ఈఏపీసెట్ రాసేవారు గణితంపై ఎక్కువగా దృష్టిపెట్టాలి. ఇందులోనే ఎక్కువ మార్కులకు ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి.

◆ ఎంసెట్ రాసే అభ్యర్థులు తెలియని ప్రశ్నలవద్ద ఆగిపోతుంటారు. ముందుగా తెలిసిన ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. వదిలేసిన ప్రశ్నలకు చివరలో జవాబులు రాయాలి.

◆ సబ్జెక్టు నిపుణులు నాకేమైనా సందేహాలు వస్తే నివృత్తి చేసేవారు. మాక్ టెస్టులు రాయడంవల్ల భయంపోయింది. ఆరో తరగతి నుంచి కోచింగ్ తీసుకోవడంవల్ల సబ్జెక్టులపై పట్టు వచ్చింది.

◆ నిర్దిష్ట సమయంలో పరీక్ష రాయాలంటే.. ప్రశ్నపత్రం మొత్తం చదవాలి. ముందుగా తెలిసిన ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. తెలియని ప్రశ్నల వద్ద ఆలోచిస్తూ ఉండిపోవద్దు. ఆ ప్రశ్నలను రాయటం వాయిదా వేయాలి. దీనివల్ల సమయం వృథా అవ్వదు.

◆ చివరగా తెలియని ప్రశ్నలకు ఆలోచించి జవాబులు రాయాలి.

◆ ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను సాధన చేసి సబ్జెక్టులపై పట్టు పెంచుకుంటే ఒత్తిడి ఉండదు. ప్రిపరేషన్ సమయంలోనే తప్పులను సరిచేసుకోవాలి.

◆ పాఠ్యపుస్తకాలను చదవాలి. ఎక్కువ సమయం సాధన చేయాలి. దీనివల్ల పరీక్షల ఒత్తిడి దూరం అవుతుంది.

◆ అభ్యర్థులు ఇంటర్ సిలబస్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై పట్టు పెంచుకోవటానికి ప్రయత్నించాలి. ఫిజిక్స్‌లో హెచ్‌సీ వర్మ రాసిన వాల్యూమ్-1, వాల్యూమ్-2 పుస్తకాలు ఉపయోగపడతాయి.

– చలమాల నాగేశ్వరరావు, న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలుఉన్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

ప్రభుత్వ ఉద్యోగం ఎలా?

ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) చేస్తున్నాను. నాకు ప్రభుత్వోద్యోగం చేయాలనుంది. ఈ అర్హతతో ఏ పోటీ పరీక్షలు రాయొచ్చు? – ఎం. రాజేష్

■ ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) చేసినవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ రకాలైన ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు.. కంప్యూటర్ ప్రోగ్రామర్, సిస్టమ్స్ అనలిస్ట్, సిస్టమ్స్ మేనేజర్, సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ ఇంజినీర్, కంప్యూటర్ సైంటిస్ట్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఐటీ ఆఫీసర్, ఐటీ కన్సల్టెంట్, కంప్యూటర్ అసోసియేట్..ఇలాంటివి. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలైన బీహెచ్ఈఎల్, బీఎస్ఎన్ఎల్, ఎన్ఎండిసీ, కోల్ ఇండియా, ఎన్టీపీసీ, భారత్ పెట్రోలియం, సెయిల్, గెయిల్ లాంటి మరెన్నో సంస్థల్లో పైన పేర్కొన్న ఉద్యోగాలున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కూడా ఐటీ కొలువులు ఉంటాయి. ఈ సంస్థలన్నీ ప్రత్యేకమైన ఉద్యోగ నోటిఫికేషన్‌ల ద్వారా నియామకాలు చేపడుతున్నాయి.



మీకు బోధన రంగంపై ఆసక్తి ఉంటే జవహర్ నవోదయ/ కేంద్రీయ విద్యాలయ లాంటి సంస్థల్లో కంప్యూటర్ టీచర్ ఉద్యోగాల కోసం ప్రయత్నించవచ్చు. ఆయా సంస్థల వెబ్‌సైట్‌లను తరచుగా సందర్శిస్తూ ఉద్యోగ ప్రకటన వచ్చినప్పుడు, దరఖాస్తు చేసుకోండి. అవసరమైన పరీక్ష రాసి ఇంటర్వ్యూ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి ప్రయత్నించండి. సాధారణంగా ప్రభుత్వ సంస్థల్లో కంప్యూటర్/ఐటీ ఉద్యోగాలు తక్కువ సంఖ్యలో ఉంటాయి. ఆ తక్కువ ఉద్యోగాలకు ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) చేసినవారితో పాటు, ఎంసీఏ, బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేసినవారూ దరఖాస్తు చేస్తుండటం వల్ల పోటీ చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలోపు ప్రైవేటు ఉద్యోగాల కోసం కూడా ప్రయత్నించి ఉద్యోగానుభవాన్ని పొందండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

పదిలమైన కొలువులెన్నో!

పదో తరగతి విద్యార్హతతోనూ ప్రభుత్వోద్యోగాలెన్నో ఉన్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎన్నో కొలువులకు ఈ విద్యార్హతతోనే పోటీ పడవచ్చు. రక్షణరంగంలోనూ అవకాశాలున్నాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ, కోస్టుగార్డు, రైల్వే, పోస్టల్, ఆర్‌బీఐ, ఆర్టీసీల్లో పదితో సేవలందించవచ్చు. ఉద్యోగంలో చేరిన తర్వాత అనుభవం, అంతర్గత పరీక్షలు, ఉన్నత విద్యతో మెరుగైన స్థాయికీ చేరుకోవచ్చు!

చిన్న వయసులో, వీలైనంత తొందరగా ఉద్యోగ జీవితం ప్రారంభించాలని ఆశించేవారు పది పూర్తయిన వెంటనే ప్రయత్నాలు ప్రారంభించవచ్చు. అలాగే ఆర్థిక పరిస్థితులు సహకరించనివారు, ఉన్నత విద్యపై ఆసక్తి లేనివాళ్లూ ఈ కొలువులకు ప్రయత్నించవచ్చు. కానీ పదోతరగతి పూర్తైన వెంటనే ఉద్యోగంలో చేరడం వీలుపడదు. యూనిఫారం కొలువులకు కనీసం 17 ఏళ్లైనా నిండాలి. సివిల్ పోస్టులకు పద్దెనిమిదేళ్లు ఉండాలి. అందువల్ల ఉద్యోగం లక్ష్యంగా ఉన్నవాళ్లు పదో తరగతి తర్వాత ఇంటర్, ఐటీఐ, డిప్లొమా...ఇలా ఏదో ఒక కోర్సులో చేరి, సన్నద్ధం కావడమే మంచిది. నేరుగా కాలేజీకి వెళ్లి చదివే అవకాశం లేకపోతే జాతీయ/ రాష్ట్ర ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ లేదా ఒకేషనల్ కోర్సుల్లో కొనసాగాలి.

అగ్నివీర్

ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్సుల్లో పదో తరగతి విద్యార్హతతో సేవలందించాలంటే ముందు అగ్నివీర్‌గా ఎంపికవ్వాలి. నాలుగేళ్లు విధుల్లో కొనసాగాలి. ఆ తర్వాత వీరిలో 25 శాతం మందికే శాశ్వత ఉద్యోగంలోకి అవకాశం లభిస్తుంది. ఈ నాలుగేళ్లలో.. మొదటి సంవత్సరం రూ.30,000 రెండో ఏడాది రూ.33,000 మూడో ఏట రూ.36,500 నాలుగో సంవత్సరం రూ.40,000 వేతనం చెల్లిస్తారు. ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. మొత్తం నాలుగేళ్ల వ్యవధికి రూ.5.02 లక్షలు అగ్నివీరుని ఖాతాలో జమ అవుతాయి. అంతే మొత్తాన్ని ప్రభుత్వమూ అందిస్తుంది. మొత్తం రూ.10.04 లక్షలకు వడ్డీని కలిపి అగ్నివీరునికి అందిస్తారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్/అంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. వీరికి సర్టిఫికెట్ అందిస్తారు. నాలుగేళ్ల తర్వాత కార్పొరేట్ సంస్థల్లో రక్షణ విభాగంలో ఉద్యోగాలు దక్కుతాయి.

ఆర్మీలో...

అగ్నివీర్ జనరల్ డ్యూటీ: పదో తరగతిలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. గ్రేడ్‌లో అయితే కనీసం సీ2 ఉండాలి. అలాగే ప్రతి సబ్జెక్టులోనూ 33 శాతం ఉండాలి.

అగ్నివీర్ ట్రేడ్స్‌మన్: పదో తరగతిలో ఉత్తీర్ణులైతే చాలు. ప్రతి సబ్జెక్టులోనూ 33 శాతం మార్కులు ఉండాలి. అలాగే ఈ ట్రేడ్స్‌మెన్‌లో కొన్ని పోస్టులకు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణతతోనూ అవకాశం ఉంది.

వయసు: కనిష్ఠంగా 17 1/2 గరిష్ఠంగా 23 ఏళ్లలోపు ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు, సరిపోయేంత ఛాతీ కొలతలు అవసరం.

ఎంపిక: అన్ని పోస్టులకూ ఫిజికల్ టెస్టులో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ టెస్టులు ఉంటాయి. వీటన్నింటిలో విజయవంతమైతే ఉమ్మడి పరీక్ష నిర్వహించి, శిక్షణలోకి తీసుకుంటారు.

అగ్నివీర్ నుంచి శాశ్వత కమిషన్‌లో అవకాశం పచ్చినవారికి సోల్జర్ జనరల్ డ్యూటీ, సోల్జర్ ట్రేడ్స్‌మన్ హోదాలు దక్కుతాయి. ఉద్యోగంలో రూ.21,700 మూలవేతనం చెల్లిస్తారు. దీంతోపాటు రూ.5200 మిలటరీ సర్వీస్ పే (ఎంఎస్‌పీ), డీఏ, హెచ్ఆర్ఏ ఉంటాయి. రూ.45,000 అందుకోవచ్చు. వీరు భవిష్యత్తులో సిపాయ్, నాయక్, హవల్దార్ హోదాలు పొందవచ్చు.

నేవీలో..

అగ్నివీర్‌గా సేవలందించిన తర్వాత నేవీలో షెఫ్, స్టివార్డ్, శానిటరీ హైజీనిస్ట్ ఉద్యోగాలకు అవకాశం లభిస్తుంది. 17-23 ఏళ్ల లోపు వయసున్న అవివాహిత పురుషులు అర్హులు. పదోతరగతిలో 50 (ఎస్సీ, ఎస్టీ 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. వయసు 18 - 22 ఏళ్లలోపు ఉండాలి.

ఎస్ఎస్‌సీ

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కేంద్ర పోలీస్ బలగాలతోపాటు ఎన్ఐఏ, ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్‌లో జనరల్ డ్యూటీ-కానిస్టేబుల్, రైఫిల్‌మ్యాన్ పోస్టులను దాదాపు ఏటా భర్తీ చేస్తోంది. ఒక్కో విడతలోనూ యాభై వేలు, ఆ పైనే ఖాళీలు ప్రకటిస్తున్నారు. పదో తరగతి అర్హతతో ఉన్న ఎక్కువ ఉద్యోగాలు ఇవే. ఎంపికైనవారు ఆసక్తి, మెరిట్ ప్రకారం.. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), స్పెషల్ ఫ్రాంటియర్ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్), అస్సాం రైఫిల్స్‌లో సేవలు అందించవచ్చు. వీటిలో ఉద్యోగానికి వయసు 18-23 ఏళ్ల మధ్య ఉండాలి. పురుషులు 170, మహిళలు 157 సెం.మీ. ఎత్తు ఉండాలి. కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ పరీక్షతో నియామకాలు చేపడతారు. ఎంపికైనవారికి లెవెల్ 3 మూలవేతనం రూ.21,700 అందుతుంది. డీఏ, హెచ్ఆర్ఏ... అన్నీ కలిపి సుమారు రూ.38,000 అందుకోవచ్చు. భవిష్యత్తులో.. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ, ఆ పైస్థాయికీ చేసుకోవచ్చు.

మల్టీ టాస్కింగ్ స్టాఫ్: కేంద్రానికి చెందిన వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన బహుళ సేవల నిమిత్తం మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) పోస్టులను ఎస్ఎస్‌సీ దాదాపు ఏటా పదివేలు, ఆపైనే భర్తీ చేస్తుంది. పరీక్షతో నియామకాలుంటాయి. 18-25 ఏళ్ల వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైనవారికి రూ.18,000 మూలవేతనం లభిస్తుంది. డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులతో నెలకు సుమారు రూ.30,000 వేతనం అందుకోవచ్చు.

ఎయిర్ ఫోర్స్‌లో..

అగ్నివీర్ వాయులో నాలుగేళ్ల సేవల అనంతరం అవకాశం దక్కినవారు ఎయిర్ ఫోర్స్‌లో గ్రూప్ ఎ మ్యూజీషియన్ హోదా పొందవచ్చు. ఈ ట్రేడ్ ఉద్యోగాలకు పదితోపాటు ఏదైనా సంగీత/ వాద్య పరికరంలో ప్రావీణ్యం ఉండాలి. రూ.21,700 మూలవేతనం, రూ.5200 మిలటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఆర్ఏ ఉంటాయి. రూ.45,000 అందుకోవచ్చు.

మ్యూజీషియన్: నేవీ బ్యాండ్‌లో పనిచేయడానికి మ్యూజీషియన్లు అవసరం. సంగీత పరికరాలపై ప్రావీణ్యం, వయసు 17 నుంచి 25 ఏళ్లలోపు ఉండాలి. సంగీత ప్రావీణ్యం, ఫిజికల్, మెడికల్ టెస్టులతో నియామకాలు చేపడతారు.

స్పోర్ట్స్ కోటా ఎంట్రీ: ఏదైనా క్రీడ/ ఈవెంట్లో ప్రావీణ్యం ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

కోస్ట్ గార్డ్

ఇండియన్ కోస్ట్ గార్డులో డొమెస్టిక్ బ్రాంచ్ కుక్, స్టివార్డ్ పోస్టులకు రాత, దేహదార్ఢ్య, వైద్య పరీక్షలతో నియామకాలు చేపడతారు. ఉద్యోగంలో చేరినవారికి ప్రారంభంలో రూ.21,700 మూలవేతనం చెల్లిస్తారు. పురుషులే అర్హులు. పదోతరగతిలో 50 (ఎస్సీ, ఎస్టీ 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. వయసు 18 - 22 ఏళ్లలోపు ఉండాలి.

రైల్వేలో..

పదో తరగతితో రైల్వేలో పలు ఉద్యోగాలు ఉన్నాయి. గ్రేడ్-4 ట్రాక్ మెయింటైనర్‌తోపాటు వివిధ విభాగాల్లో అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. వేతన శ్రేణి ప్రకారం వీటిని లెవెల్-1 (ప్రారంభస్థాయి) ఉద్యోగాలుగా పరిగణిస్తారు. ఎంపికైనవారికి రూ.18,000 మూలవేతనం లభిస్తుంది. అన్నీ కలిపి రూ.30,000 వరకు మొదటి నెల నుంచే జీతం పొందవచ్చు. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులతో నియామకాలు చేపడతారు. రైల్వే భద్రత విభాగంలోనూ సేవలు అందించవచ్చు.

పోస్టల్

పోస్టల్ శాఖలో పోస్టుమ్యాన్, మెయిల్ గార్డు ఉద్యోగాలకు పరీక్షలో చూపిన ప్రతిభతో నియామకాలు చేపడతారు. వీటికి ఎంపికైనవారికి రూ.21,700 మూలవేతనం లభిస్తుంది. డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులతో రూ.35,000 అందుకోవచ్చు. రెండు మూడేళ్లకు ఒకసారి ప్రకటన ఆశించవచ్చు.

ఆర్‌బీఐ

రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆఫీస్ అటెండెంట్ విభాగంలో ఫ్యూన్, దర్వాజ్, మజ్దూర్ పోస్టులను భర్తీ చేస్తుంది. వయసు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. పరీక్షతో నియామకాలుంటాయి. ఉద్యోగంలో చేరిన వారు సీనియర్ ఆఫీస్ అటెండెంట్‌గా పదోన్నతి పొందవచ్చు. డిగ్రీ పూర్తయితే శాఖాపరమైన పరీక్షలతో అసిస్టెంట్ స్థాయి దక్కుతుంది.

■ ఐటీబీపీఎఫ్, ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్.. తదితర కేంద్రీయ ఆర్మ్‌డ్ దళాలు కానిస్టేబుల్ హోదాలో కుక్, వాషర్‌మన్, బార్బర్, వాటర్ క్యారియర్, సఫాయి కర్మచారి తదితర పోస్టులను విడిగా భర్తీ చేస్తున్నాయి. వయసు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. శారీరక సామర్థ్య, రాత, వైద్య పరీక్షలతో నియామకాలుంటాయి.

■ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో లేబర్ పోస్టులు, బ్యాంకులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఫ్యూన్ పోస్టులకు పదో తరగతి సరిపోతుంది.

■ రాష్ట్ర అటవీ శాఖల్లో బంగ్లా వాచర్ పోస్టులకు పదితో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఫిజికల్ టెస్టుల ప్రతిభతో నియామకాలు చేపడతారు. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. పురుషులకు 163 సెం.మీ., స్త్రీలకు 150 సెం.మీ. ఎత్తు అవసరం.

కండక్టర్: ఏపీఎస్/టీఎస్ ఆర్‌టీసీల్లో కండక్టర్ పోస్టులను ఖాళీలు ఉన్నప్పుడు పదో తరగతి మార్కుల మెరిట్‌తో భర్తీ చేస్తారు.

డ్రైవర్: పదో తరగతి విద్యార్హతతోపాటు హెవీ వెహికల్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌బీ ...మొదలైనవాటిలో డ్రైవర్ పోస్టులకు పోటీ పడవచ్చు. ఆర్టీసీ బస్ డ్రైవర్ ఉద్యోగానికీ ఈ లైసెన్స్ ఉన్నవారు ప్రకటన వెలువడినప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రామీణ్ డాక్ సేవక్ (జీడీఎస్): ఇందులో బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ (ఏబీపీఎం), మెయిల్ డెలివరర్ (ఎండీ), ప్యాకర్ పోస్టులను పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నారు. ఏటా ఈ ప్రకటనలు వెలువడుతున్నాయి. అంతేకాదు శాఖాపరమైన పరీక్షలతో పోస్టుమెన్, మెయిల్ గార్డు, క్లర్క్.. మొదలైన పదోన్నతులు పొందొచ్చు.

పరీక్షల్లో..

పదో తరగతి విద్యార్హతతో నిర్వహించే పరీక్షల్లో.. జనరల్ నాలెడ్జ్/అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, బేసిక్ అరిథ్‌మెటిక్, న్యూమరికల్ అప్టిట్యూడ్, బేసిక్ రీజనింగ్, జనరల్ సైన్స్‌ల్లో ప్రశ్నలుంటాయి. పాఠ్యాంశాలపై పట్టుంటే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

పదితో-5

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

ఎయిమ్స్ నాగ్‌పుర్‌లో సీనియర్ రెసిడెంట్లు

నాగ్‌పుర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 73 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఫార్మకాలజీ, జనరల్ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, పాథాలజీ, సైకియాట్రీ

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ.

వయసు: 45 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.500.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.07.2023

వెబ్‌సైట్: https://aiimsnagpur.edu.in/ recruitment-front/current_posting

ఎయిమ్స్-రాయ్‌పుర్‌లో..

రాయ్‌పుర్‌లోని ఎయిమ్స్ 169 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మెడికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్స్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ/ ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ/ డిప్లొమా.

వయసు: 45 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.1000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.07.2023.

వెబ్‌సైట్: www.aiimsraipur.edu.in/user/vacancies.php

బెల్-బెంగళూరులో ఇంజినీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఆధ్వర్యంలోని ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ 82 ట్రెయినీ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, కమ్యూనికేషన్, టెలికమ్యూనికేషన్, మెకానికల్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ ఇంజినీరింగ్.

వయసు: 28-32 ఏళ్లు ఉండాలి.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.400.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా.

చిరునామా: Manager (HR), Product Development & Innovation Centre (PDIC), Bharat Electronics Limited, Prof. U R Rao Road, Near Nagaland Circle, Jalahalli Post, Bengaluru - 560 013, India.

దరఖాస్తుకు చివరి తేదీ: 28.06.2023.

వెబ్‌సైట్: https://www.bel-india.in/

ఎన్‌టీపీసీ-న్యూదిల్లీలో...

న్యూదిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) 15 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: గ్రామీణ నిర్వహణ/ గ్రామీణాభివృద్ధి/ పునరావాసం/ కమ్యూనిటీ డెవలప్‌మెంట్/ స్థానిక పాలన/ సామాజిక అభివృద్ధి/ సుస్థిర అభివృద్ధి

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్/ పీజీ/ పీజీ డిప్లొమా/ ఎంఎస్‌డబ్ల్యూ/ ఎంబీఏ.

అనుభవం: కనీసం 2 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.06.2023.

వెబ్‌సైట్: https://careers.ntpc.co.in/recruitment/

ఎస్‌పీఎంసీఐఎల్-ముంబయిలో..

ముంబయిలోని సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్) 64 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ టెక్నీషియన్, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, జూనియర్ బులియన్ అసిస్టెంట్ పోస్టులు.

విభాగాలు: వెల్డర్, మౌల్డర్, కెమికల్ ప్లాంట్, టర్నర్, ఫిట్టర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఐటీఐ/ గ్రాడ్యుయేషన్.

వయసు: 25-28 ఏళ్లు ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, షార్ట్‌లిస్టింగ్/ స్కిల్‌టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.600.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.07.2023.

వెబ్‌సైట్: https://igmmumbai.spmcil.com/en/

వర్క్ ఫ్రమ్ హోమ్

క్రౌడ్‌ఫండింగ్/ఫండ్‌రైజింగ్

సంస్థ: పాజ్
స్టైపెండ్: నెలకు రూ.1,500-10,000
దరఖాస్తు గడువు: జూన్ 27
అర్హతలు: బిజినెస్ రిసెర్చ్, కంటెంట్ రైటింగ్, డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ రాయడం, సేల్స్, సేల్స్ అండ్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/18ba7b

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: జెకో స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: జూన్ 30
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, ఈమెయిల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మ